# వక్రించిన విధి !

'కృషితో నాస్తి దుర్భిక్షం...' ఈ కొటేషన్ టోటల్లీ రాంగ్! కొందరు ఎంత తీవ్రంగ కృషి చేసినా అదృష్టం కలిసిరాదు సరికదా అనుకున్నవి నెరవేరవు.

దీన్ని కొద్ది మార్పుతో సవరించి 'కృషితోనూ దుర్భిక్షమే' అని పాపులరైజ్ చేయాల్సిన అవసరం ఎంతో వుంది!! 'నాస్తి' అనే పదాన్ని ఎలిమినేట్ చేసి (అంటే... సెన్సార్ కట్ అన్నమాట) ప్రజల్లోకి తీసుకెళ్ళటం సమంజసం అన్పించక మానదు.

బాల్యం నుండి నేను సలపని కృషి లేదు!. రోజులో పన్నెండు గంటలు పుస్తకాలు ముందేసుకుని కుస్తీ పట్టినా... చదువు బుర్రకెక్కి వంటబట్టేది కాదు. పాఠాలు బట్టీయం వేయటం.... చదివిందే వందసార్లు చదివి రుబ్బటం వంటి క్రియలు చేపట్టి ఆచరిస్తున్నా ప్రయోజనం శూన్యం! మా గ్రాండ్‌పా ఆయుర్వేద భిషక్ కావటాన సరస్వతీలేహ్యం నాచేత బోలెడంత తిన్పించాడు. అయినా ఆ మందు పనిచేసి ఏడవలేదు. అదేమంటే అన్ని మందులు అందరికీ సూటవవ్ అని నవ్వేశాడు తాతగారు. ఒక్క మందుతోనే రోగాలు తగ్గేటట్టయితే ఇన్ని రకాల మందుల కంపెనీలు... మెడికల్ షాప్స్ ఎందుకుంటయ్‌రా పిచ్చి సన్నాసీ అంటూండేవాడు డాడీతో!

ఇంత గ్రైండ్ చేసినా అత్తెసరు మార్కులతో పాసవుతూండేవాడిని!. చదువులో వెనకబడిపోతే... ఎందుకూ పనికిరాని 'సోంబేరు' నవుతానేమోని మా మమ్మీ బెంగ!.

డాడీ ఎట్లాగూ నిశానీదారు కాబట్టి నా చదువు గురించి పెద్దగ పట్టించుకునే వాడేకాదు! కాదు కూడదని మమ్మీ మొండికేస్తే ట్యూషన్‌కు పంపటానికి డాడీ ఎట్టకేలకు అంగీకరించాడు.

నన్ను చచ్చేట్టు చావగొట్టి గంధం చెక్కనుసానరాతి మీద అరగతీసినట్టు పాఠ్యాంశాలు నూరిపోయాలనే మాష్టారు చేసిన ప్రయత్నం బూడిదలో పోసిన పన్నీరే అయింది.

ప్రైవేట్ మాష్టారి చేతిలో బెత్తం ఎప్పుడూ నా వీపు మీదే భిన్న రీతుల్లో నాట్యం చేస్తూండేది. వీపు... చేతులు వాచిపోతే ఆ దెబ్బలకు ఓర్చుకోలేక ప్రైవేటు మాన్పించింది మమ్మీ!. ఒక్కగానొక్క బిడ్డను చావగొడతాడా ఆ టీచరు?... వాడి చేతులు విరిగిపోను... వాడు చెప్పే చదువు నాశనంగానూ అనేసి శాపనార్థాలు పెట్టేది.

దెబ్బలు తగిలిన చోటల్లా వెన్నపూసరాసేది! మమ్మీ దగ్గర గారం పోతూండేవాడిని.

డాడీ రావణాసురుడు... హిరణ్యకసిపుడే!. నా గురించి అస్సలు పట్టించకోడు. అర్జనే ఆయన సర్వస్వం! అక్షరంముక్క రాకపోయినా... నిశానీదారుడే అయినా... రాజకీయాల్లో రాటుతేలినవాడు డాడీ!. ఇంటి గురించి అసలు పట్టించుకోడు. హైదరాబాద్... ఢిల్లీ చుట్టూ తిరగటంతోనే సరిపోతుంది. పైరవీలు చేయటంలో ఆయన్ను మించినవారు రాష్ట్రంలోనే లేరు!. పన్లు చాలామటుకు ఫోన్ ద్వారానే జనానికి చేసిపెడుతూంటారు. తప్పనిసరి అనుకుంటే కాని మనిషి కదలడు!. ఒక్కముక్కలో చెప్పాలంటే పదవిలేని మంత్రి అన్నమాట!. డాడీ మాటకు ఎదురులేదు. సి.ఎం. కాదన్నా... పి.ఎం. దగ్గరకెళ్లి పని పూర్తిచేసుకురాగల దిట్ట!. అంతా పర్సంటేజీ వ్యవహారం! నోట్లకట్టలు కంటికి అవుపిస్తే గాని ఏ పనికైనా వుపక్రమించడు. పావులు ముందుకు కదపడు!!

ఇల్లు పట్టించుకోని డాడీని చూచి మమ్మీ ధారావాహికంగ ఏడుస్తునే వుంటుంది. మమ్మీ ఏడిస్తే కృష్ణానదికి వరదొచ్చినట్టే! సముద్రంలో సునామీ వచ్చి వుప్పొంగినట్టే!

టెన్త్ పాసవటానికి నానాయాతన పడాల్సివచ్చింది. ఇంటర్మీడియేట్లో సీటు రాక మొరాయించింది ర్యాంకు తెచ్చుకున్న వారికే సీటు దొరకటం దుర్లభమౌతున్న ఈ రోజుల్లో... బొటాబొటీ మార్కులతో పాసైన నాకు ఎడ్మిషన్ ఎలా దొరుకుతుంది?

ఆ విషయమే డాడీకి చెప్పాను. మమ్మీకేమో... నన్ను కలక్టర్నో... డాక్టర్నో... ఇంజనీర్నో చేసి విదేశాలకు పంపాలని బోలెడంత ఆశ!.

చదివినంతవరకు చాలు! ఇక పొలం పన్లు చూచుకోమని డాడీ రూలింగ్ ఇచ్చాడు! కాదు జి.ఓ. పాస్ చేశాడు! డాడీ నిర్ణయం మమ్మీకి బొత్తిగ నచ్చలేదు. కొడుక్కి ఇంటర్లో సీటు రాకపోతే... నిరాహారదీక్ష చేస్తానంది. సీలింగ్ ఫ్యానుకు వురేసుకుంటానంది.... పొలంలో వున్న దిగుడు బావిలో దూకి చస్తానంది. ఇంకా చాలా చాలా అన్నది.

'మనకేం తక్కువ!... కొడుక్కోసం ఒక జూనియర్ కాలేజైనా కట్టించండి.... తప్పదు...' అన్నది మమ్మీ.

'ఇప్పటికిప్పుడు కాలేజీ కట్టించాలంటే మాటలా? ఏడాదికాలమైన పడుతుంది.... తెల్సా' భార్యకి ఎదురు చెప్పాడు.

'అలా అయితే ఓ లక్ష డొనేషన్ పారేసి ఏ ప్రైవేట్ కాలేజీలోనైనా జాయిన్ చెయ్యండి.'

'ఈ అడ్డగాడిదకోసం అంతేసి డబ్బు తగలేయటం శుద్ధవేస్ట్'. ఆ డబ్బుంటే పది

రూపాయల వడ్డీకి తిప్పచ్చు! ఓరుగల్లు బసవన్నలాగ రంకెవేశాడు డాడీ.

'నోరు ముయ్యవయ్యా మగడా! - మనకు ఒక్కగానొక్క నలుసు!. మనకున్న కోట్లు ఏం చేసుకుంటాం? ఇక్కడ బ్యాంకులు చాలకే కదా స్విస్ బ్యాంకులో నల్లడబ్బు దాచింది. పిల్లవాడికోసం ఖర్చుపెట్టకపోతే... మనం పోయేటప్పుడు కట్టుకుపోతామా?...' తాషామరపా వాయించింది భర్తను!

'ఎదుటివాడి ముఖాన నోట్లకట్టలు (బ్లాకేలెండి) విసిరికొట్టటానికి నేనేం వెనకాడను. కాకుంటే... చదువు అబ్బని బుజ్జిగాడి కోసం అంతేసి ఖర్చుపెట్టటం అవసరమానేది నా ఆలోచన...' నీళ్లు నమిలాడు.

'మీరేం చేస్తారో నాకు తెలియదు. బుజ్జిగాడు పెద్దచదువు చదివి విదేశాలు పోవాలి!... మనవాడి కోసం సప్తసముద్రాలను హనుమంతుడిలా లంఘించి అయినా సరే వెళ్లి ఇంటర్లో సీటు సంపాదించుకురండి..'

పేరెంట్స్ వారిదోవన వాళ్లు కొట్టుకు చస్తునే వున్నారు అసెంబ్లీలో.. పార్లమెంట్‌లో లాగ... నామటుక్కు నేను మేడ మీదికెళ్లి నాగదిలో తీరుబడిగ కూర్చుని సిగరెట్ (ఇంపోర్టెడేలెండి) వూదుతూ రిలాక్స్ అవటంలో నిమగ్నుడినైనాను... టి.వి.లో వన్‌డే క్రికెట్ మ్యాచ్ వీక్షిస్తూ...!

డాడీ వద్ద టోటల్‌గ ఎంత డబ్బుందో ఆయనకే కంప్యూటర్ లేదూ ల్యాప్‌టాప్ అయినా సరే చెప్పలేని స్థితి!.

కాలేజేం ఖర్మ నాకోసం యూనివర్సిటీయే ఏర్పాటు చేయగల నిధి ఆయనవద్దవుంది!. 'అబ్రకదబ్ర' అని మ్యాజిక్ మంత్రం చదివితే చాలు తెల్లారేలోగా అల్లావుద్దీన్ అద్భుత దీప మహిమలాగ అన్నమాట) ఆగ్రాలో పాలరాతి తాజ్‌మహల్లా వెలుస్తుంది. (సారీ... మొలుస్తుంది... సారీ సారీ... ప్రత్యక్షమౌతుంది.)!

గోటితో పోయేదానికి గొడ్డలిని వుపయోగించటందేనికానేదే ఆలోచన!. డొనేషన్ పారేసి ఎడ్మిషన్ తెచ్చుకునే ఇంతటి స్మాల్ విషయానికి హైరానా పడి కోట్లు కుమ్మరించటం దేనికని ఆయన యోచన!

డొనేషనాయనమ: మంత్రం జపించి మొత్తానికి ఓ పెద్ద ప్రైవేట్ కాలేజీలో ఇంటర్... ఆపై మెడిసిన్ అయిందన్పించాను.

అచ్చోసిన ఆబోతులాగ విచ్చలవిడిగ తిరిగే అవకాశం చేజారిపోయినందుకు తెగ వర్రీ అయినాను!. ఏం చేస్తాను? జల్సాగ ఖర్చుపెడుతూ జులాయిగ తిరిగే అదృష్టం నా ముఖాన ఆ దేవుడు రాయలేదు మరి. ఏం చేస్తాం? మొత్తానికి ఎలాగైతేనేం

డాక్టర్ని అయ్యాననిపించుకున్నాను.

డబ్బనే యమపాశంతో డాడీ నన్ను కట్టిపడేసిన యముడు!

మెడిసిన్ పూర్తయ్యేవరకు... అనగా అయిదేళ్లూ నన్ను చాది... చెమడావొలిచారు. మా మెడికల్ కాలేజీ సంస్థ ఛైర్మన్‌కు ప్రభుత్వంలో బెత్తెడు మందాన పలుకుబడి వుండటాన... చదివినవారికి చదవనివారికి... ప్రొఫెసర్లు వున్నా లేకపోయినా... ల్యాబ్ ఫెసిలిటీస్ వున్నా లేకపోయినా... అమ్మాయిలతో లవ్‌లో పడ్డా పడకపోయినా... కాపీలు కొట్టినా కొట్టకపోయినా... మొత్తానికి నావంటి శుంఠలంతా మెడిసిన్ పాసైనారు. వారిలో నేను ప్రథమ స్టూడెంట్‌ని (ప్రథమ పౌరుడిలాగ)!

కల్లోనైనా నోచుకోని 'ర్యాంక్' నాకొకటి సంస్థ బహుమతిగా ఇచ్చింది! మా మామ్మీ కల నిజమైంది. ఎంతమంది రోగులకు నాచేతిలో చావు రాసిపెట్టివుందోగాని... హౌస్ సర్జన్ పూర్తై ఉద్యోగం కోసం దేశం మీపడ్డాను.

నావంటి వాడు కార్పోరేట్ హాస్పిటల్లో డాక్టర్‌గా వుండటం ప్రమాదం! చచ్చే పేషెంట్ల సంఖ్య పెరిగితే... నన్ను బ్రతకనీరు చనిపోయే వారి బంధువులు!. అదే ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టరైతే... ఆడింది ఆట!.... పాడింది పాట! డ్యూటీ చేసినా చెయ్యకపోయినా జీతం జేబులో కొచ్చేస్తుంది. పేషెంట్స్ మా నిర్లక్ష్యం వలన పోయినా పూర్తి బాధ్యత ప్రభుత్వానిదే అవుతుంది!. మహా అయితే డాక్టర్ని బదిలీ చేస్తారు. అదే కార్పొరేట్ ఆస్పత్రి అయితే 'వూస్ట్' చేస్తారు.

ఏమైనా ప్రభుత్వోద్యోగి అయితేనే లైఫ్.. జాబ్... ఇంపోర్టెడ్ 'వైన్' తాగినంత మజాగ వుంటుంది.

అథవా... ఏ తప్పో జరిగిపోయిందని మీడియా అల్లరిపెట్టినా... పత్రికలు గొంతు చించుకున్నా... సమ్మె ఆయుధం 'జూడాల' చేతిలో వుండనే వుంది. సమ్మె మామూలు ఆయుధం కాదండీ బాబూ... ఇంద్రుని చేతిలో వజ్రాయుధం అంతపవర్‌ఫుల్! డాక్టర్ల సమ్మె దెబ్బకు ప్రభుత్వం... దిగిరావలసిందే!- లేకపోతే రోగుల గగ్గోలు.. డెత్‌రేట్ ఇన్‌క్రీజ్ అవటం ఖాయం!.

నేను ఇండియాలో... సారీ... ఎ.పి.లో డాక్టర్... (అదీ ప్రభుత్వాసుపత్రిలో) పోస్టింగ్ కా(రా)వాలనే కలలు కంటూంటే మమ్మీ నన్ను అమెరికా పంపిస్తానంటూ మరోవైపు శపథం!. అమెరికా బయల్దేరమంటూ రోజూ నన్ను చిత్రికపడుతోంది. రాచిరంపాన పెడుతోంది. ప్రాణాలు తోడేస్తోంది.

నా భవితపై ఒక డెసిషన్ రాకుండానే... సడన్‌గ మా బంగళాలో పిడుగుపడింది!. అందరం కుదేళ్లయినాం!. ఎవరి దిష్టి తగిలిందో?... ఎవరికేం మాయరోగం వచ్చిందో?... ఎవరికన్ను కుట్టిందో?... ఎవరు ఈర్ష్యపడ్డారో... ఎవరు ఉప్పందించారో తెలీదుగాని...

ఆకస్మికంగ, మా ఇంటి మీద ఎ.సి.బి. దాడి జరిగింది. ఆకాశం వురమకుండానే పిడుగుపడ్డట్టయింది!. ఇంకేముంది కొంపమునిగింది! మమ్మీ మెడలో గల తాళిపుటుక్కున తెగినంత బాధపడింది. ఆమె ప్రాణం విలవిల్లాడింది. డాడీకి నోట మాటకరువైంది. మనిషి కొయ్యబారిపోయాడు!

గోల్డు... సిల్వర్... విలువైన పత్రాలు... బ్లాక్‌మనీ... బ్యాంకు డిపాజిట్లు... లాకర్స్... సర్వం ఎ.సి.బి. వారి పరమైనయ్. డాడీ కటకటాలపాలు! నేను మమ్మీ రోడ్లపాలు!!

ఏడుకొండలవాడికి దయలేకుండా పోయింది. ఏటా ఆయన్ను దర్శించి కట్టల కట్టలు శ్రీవారి పవిత్ర హుండీకి సమర్పిస్తున్నా!... ఎన్నెన్నో బంగారు నగలు వేంకటేశు నికి చేయించినా... కనికరంలేకపోగా... ఒక్కసారిగ ఆగర్భ శ్రీమంతులమైన మమ్మల్ని బికారులను చేసి కసితీర్చుకున్నాడంటూ... మళ్లీ గుండె బాదుకుంటూ వలవలా ఏడ్చింది మమ్మీ.

ఈ పరిస్థితుల్లో నాకు గవర్నమెంట్‌లో పోస్టింగ్ రావటం దుర్లభం అన్పించింది.

డాడీని కస్టడీలోకి తీసుకెళ్లేక రిమాండ్‌లో వుండగానే మమ్మీ గుండెపోటుకు గురై మాస్పిటల్లో ఎడ్మిట్ చేసీచేయగానే ఆకస్మికంగ కన్నుమూయటంతో నేను వంటరివాడినయ్యాను. ఏనుగంతటి డాడీ... ఎసిబి దాడితో పీనుగైనాడు. నూరు గొడ్లను తిన్న రాబందుసైతం ఒక్కగాలి వేటుకు కొట్టుకుపోయిందనే సామెత డాడీ విషయంలో నిజమైంది.

అలాంటి వ్యక్తిని కష్టకాలంలో ఆదుకోవటానికి ఎవ్వరూ ముందుకు రానందుకు నా ప్రాణం విలవిల్లాడింది. డాడీ ఎదురుగ నిలిచేటందుక్కూడా భయపడేవారంతా ఇప్పుడు ఆయన్ను బహిరంగంగా ఆక్షేపించటం చూస్తూ ఆశ్చర్యంవేసింది. దీనికి తోడు... మీడియావారు... పత్రికలు... డాడీ అంతటి ప్రముఖ వ్యక్తిని 'అన్‌పాపులర్' చేయటం చూస్తూ నా కళ్లు చమర్చినయ్!

డాడీ ప్రభంజనం ... ఒకశకం... అధ్యాయం ముగిసిపోయినందుకు నా జవసత్వాలుడిగినట్టు అన్పించి కృంగిపోయాను!.

--- సమాప్తం ---